# వేట

కృష్ణమూర్తి మాంచి విలుకాడు. అంబు విసిరితే గురి తప్పదు. అంతటి చాకచక్యంతో వేటాడగల తెలివి అతని సొంతం.

మనిషి అందగాడేం కాదు. అయితే గొప్ప మాటకారి!!

కృష్ణమూర్తి మాటల్లో గాలి తప్ప మరేమీ వుండదని అందరికీ తెలుసు. అయితే అతని మాటల్లో ఎదుటివారిని ఆకట్టుకునే అయస్కాంత శక్తి వుంది. దేవుడు అతనికిచ్చిన గొప్పవరం అది.

బస్సు ప్రయాణాల్లో, ఆఫీసులో, సినిమాహాల్లో ఒక్క చోట నేమిటి... ఎక్కడబడితే అక్కడ... అపరిచితులు సైతం

ఆకర్షింపబడతారు. సంభాషణలో మంత్రశక్తి... విసిరే చెణుకుల్లో గారడి అంత గొప్పది.

ముఖ్యంగా ఆడవాళ్ళు (పెళ్ళిఅయిన వాళ్ళయినా సరే) అతని మాటల మత్తులో (మాయలో) పడక తప్పదు. అది రూలు!

సినిమా చూస్తూ కృష్ణమూర్తి చేసే కామెంట్సుకి, కాంప్లిమెంట్సుకీ, ముందు వెనుక సీట్లలో కూర్చున్న వాళ్ళు తల తిప్పి అతడ్ని క్రీగంట చూడాల్సిందే.

ఎదుటివాళ్ళు తనకేసి చూస్తున్నారనే విషయం పసిగట్టగానే... వారితో మాటలు కలుపుతాడు.

కేవలం పరిచయంతో ప్రారంభమైన సంభాషణ స్నేహంగా మారి, ప్రేమగా ప్రాణం పోసుకుని శృతిమించనూ వచ్చు.

కథ ముగింపు చివరికి సుఖాంతం కాక తప్పదు.

ఫ్రండ్సు సర్కిల్లో కృష్ణమూర్తిని ఇంటికి పిల్చి కాఫీ ఆఫర్ చేయగల 'గట్సు' ఎవ్వరికీ లేవు.

ఈ డొంకతిరుగుడంతా లేకుండా, ఒక్క మాటలో చెప్పాలి అంటే, కృష్ణమూర్తి గోపాలకృష్ణుడే!!

నెల్లూరికి కొత్తగా ట్రాన్స్ఫరుమీద వచ్చాడు.

ఊరు, అక్కడి మనుష్యులూ పూర్తిగా కొత్త. అయినా మనిషిలో ఈషణ్మాత్రమైన దిగుల్లేదు.

పెట్టే బేడాతో బయల్దేరి వచ్చి నేరుగా ఆఫీసులోనే మకాం పెట్టేడు. అఫీషియల్ ప్రొసీజరు అడ్డురాకుండా రాగానే పై ఆఫీసర్ని పట్టేశాడు. మస్కా కొట్టేశాడు.

వచ్చిన మొదటిరోజు ఆఫీసులో అందరితో పరిచయం చేసుకోవటంతో సరిపోయింది.

హోటలు భోజనం, ఆఫీసులో పడక.

రెండోరోజు రాత్రి భోజనం ముగించుకుని కృష్ణమూర్తి ఆఫీసు చేరుకునే సరికి ఎనిమిది గంటలైంది.

ఆఫీసు బిల్డింగులో మొత్తం ఆరు గదులున్నయ్. చివరి గదిలో రెండు బల్లలు దగ్గరగా చేర్చి పడక ఏర్పాటు చేసుకున్నాడు.

ట్యూబ్ లైటు వెలుగుతూనే వుంది గదిలో. ఫాన్ తిరుగుతూ వుంది. కాస్సేపు ఏదో పత్రిక చదివేడు — రెండు సార్లు ఆ తర్వాత అటూ ఇటూ పొర్లేడు.

కొత్త చోటు కావటం వల్లనేమో ఎంతకీ నిద్ర రాకుండా వుంది.

లేచి కూర్చుని సిగరెట్ వెలిగించాడు.

మరో పది నిముషాలు గడిచేక గది తలుపు తీసుకుని బైటకొచ్చాడు.

మెట్ల దగ్గరగా వున్న బల్లమీద కూర్చుని చుట్ట కాల్చుకుంటున్నాడు వాచ్ మెన్.

ఇలాంటి సమయంలో నైట్ వాచ్ మెన్ ఒక్కడే ఆపద్బాంధవుడిలా అవుపించాడు.

దగ్గరగా వచ్చిన కృష్ణమూర్తిని చూచి సగం కాలిన చుట్ట పీకను దూరంగా విసిరేసి "ఏం బాబూ.... తమరు నిద్రపోలేదా..." అడిగేడు వాచ్ మెన్.

వాచ్ మెన్ వయస్సు షుమారు యాభై పైచిలుకు వుంటుందనిపించింది — అయినా మనిషి ఆరోగ్యంగా, దృఢంగా వున్నాడు.

"నీ పేరేమిటోయ్..." అడిగేడు కృష్ణమూర్తి.

"రాజయ్యండి..." వినయంగా చెప్పేడు.

"నీది ఈ వూరేనా?—" మరో ప్రశ్న విసిరేడు.

"కాదండి పక్కనే వున్న రాజుపాలెం, కానీ... పుట్టిం దగ్గర్నుంచీ... పెరిగింది ఇక్కడేనండి..."

లైటు వెల్తుర్లో రాజయ్యని నఖశిఖ పర్యంతం పరీక్షగా చూస్తూ ఎలాంటి వ్యక్తి అయివుంటాడని స్టడీ చేయటంలో లీనమైనాడు కృష్ణమూర్తి.

నెల్లూరు గురించి ఫ్రెండ్సు అనేక రకాలుగా అనుకోవటం తాను చాలా సార్లు విన్నాడు.

తన అలవాట్లకు అన్ని విధాలుగా తగిన ఊరేననే భావనలో వున్నాడు.

కానీ... ఇంతవరకూ ఏ వక్కరితోనూ సంపూర్ణమైన పరిచయం దొరకలేదు.

అందుకే రాజయ్యని మాటల్లోకి దింపటం తప్పని సరైంది.

ప్యూన్లు, స్వీపర్లు.... వాచ్ మెన్లూ చాలా పన్లకీ అవసరాలకూ గొప్పగా ఉపయోగపడ్తారనే పచ్చి నిజం కృష్ణమూర్తికి బాగా తెలుసు.

అలాంటి వారి నాడి పరీక్ష చేయగల తెలివి కృష్ణ మూర్తి స్వంతం.

వాచ్ మెన్ రాజయ్యని బ్రేక్ వేసి పడేయాలని చూస్తున్నాడు.

కానీ లొంగే ఘటంలా అవుపించ లేదు.

ఏమీ తెలీని అమాయకుడిలా మాట్లాడుతున్నాడు. బొత్తిగా సందివ్వటం లేదు.

లాభం లేదనుకుని వెళ్ళి పడుకున్నాడు.

రెండు రోజులు నిరుత్సాహంగానే గడిచాయి. కటిక లంఖణాలే చేయాల్సి వచ్చింది.

తానొచ్చిన మూడు రోజుల్లో ఆఫీసు ప్యూను గోవిందు కాస్త దగ్గరయ్యాడు.

వాడ్ని దువ్వే ప్రయత్నంలో వున్నాడు కృష్ణమూర్తి.

గోవిందు చాకులాంటి కుర్రాడు.

అలాంటివాడే తన కవసరాలు తీర్చగలడన్పించింది.

ఆఫీసు టైము కాగానే... గోవిందును వెంటేసుకుని బజారు బయల్దేరేడు కృష్ణమూర్తి.

నేరుగా కోమల విలాస్‌కి తీసుకెళ్ళి పీకలదాకా తిన్పించాడు - ఆ తర్వాత మొదటి ఆట సినిమాకు లాక్కెళ్ళేడు కృష్ణమూర్తి అంతటి యు. డి. క్లార్కు తన పట్ల చూపుతున్న వాత్సాల్యాకి లోలోపలే సంబరపడిపోతున్నాడు గోవిందు.

కృష్ణమూర్తి ఆలోచన్లు సినీమా చూడటంమీద లగ్నం కావటం లేదు. తన మనసులో కోరికలను గోవిందుతో ఎలా చెప్పటమానే మదనపడ్తున్నాడు.

ఆఫ్ట్రాల్ గోవిందు తన ఆఫీసులో ప్యూను వెధవ. అందునా క్లాస్ ఫోరు సన్యాసి! అలాంటివాడిదగ్గర తాను 'ఛీప్పై' పోతానేమోననేబెంగాలేక పోలేదు కృష్ణమూర్తిలో.

అయినా... ఇలాంటివాళ్ళద్వారానే విషయాలను అతి సునాయాసంగా రాబట్టవచ్చన్పిస్తోంది. తనకు అనుభవం నేర్పిన గుణపాఠం అది.

సినిమా వదిలేరు.

"ఇప్పుడెక్కడికి వెడదాం..." గోవిందును అడిగేడు ప్రక్కనే నడుస్తూ.

"మీరు హోటల్లో భోజనంచేసి పడుకోండి సార్ నేను ఇంటికి వెడతాను..." చెప్పేడు గోవిందు.

"నాన్సెన్సు! అప్పుడే ఇంటి కేమిటోయ్ పదిగంటలైనా కాలేదు అప్పుడే ఏం నిద్ర పట్టి ఏడుస్తుందీ... సరదాగా అలా నాలుగు వీధులూ తిరుగుదాం..."

"రాత్రిపూట ఎందుకు సార్ తిరగటం..."

"ఈ వూరు వాడివి నువ్వు. వూళ్లో సందులూ గొందులూ అన్నీ తెలిసివుండి వుంటయ్ నీకు. నన్ను మంచి చోటు కెక్కడికైనా తీసుకెళ్ళు..." మనసులో కోరికను మెల్లిగా వెలిబుచ్చాడు కృష్ణమూర్తి.

కృష్ణమూర్తి వుద్దేశాన్ని పసిగట్టలేనంతటి పసివాడేం కాదు. గోవిందు కానీ... భయం పీక్కుతింటోంది. మాట్లాడేటందుకు సాహసించలేక పోతున్నాడు. అంతే!

గోవిందుగాడితో ఎంతసేపు తిరిగినా కాళ్ళు పీకటం తప్పించి తన పని సానుకూలం కాదనే విషయం గ్రహించిన కృష్ణమూర్తి... వాడ్ని ఓ అరగంట తర్వాత వదలించుకుని... తను హోటల్లో భోజనంచేసి ఆఫీసు చేరుకున్నాడు.

*　　*　　*　　*

పదిరోజులైనా పూర్తిగా కాకముందే, శ్రీమతి నుంచి అరడజను వుత్తరాలైనా వచ్చివుంటయ్ కృష్ణమూర్తికి.

ఇల్లు తీసుకోమని ప్రతి వుత్తరంలోనూ వ్రాయటం చూచి విసుక్కున్నాడు.

ఇళ్ళకోసం నాలుగైదు బజార్లు తిరిగేడు.

అవసరం తనది గనుక తనకు అందుబాటైన అద్దెలో వున్న ఇల్లొకటి ఖాయం చేశాడు.

ఆ ఇల్లు చూస్తుంటే... ఇల్లు ఇరకటం... ఆలిమర్కటం... అనే సామెత గుర్తొచ్చేలా వుంది.

గాలీ వెల్తురూ బొత్తిగా ఇంట్లోకి వచ్చే ఇరువు కన్పించలేదు.

ఏం చేస్తాడు... తొందర్లో అంతకు మించిన మంచి ఇల్లు దొరకలేదు.

ఇల్లు తీసుకున్న రెండోరోజే సామాన్లతోపాటు ఇల్లాలునూ తెచ్చుకున్నాడు కృష్ణమూర్తి.

ఆ రోజు ఆదివారం.

ఆఫీసు ఎలాగూ లేదు.

తిరిగే కాలు తిట్టే నోరూ వూరుకోదు అన్న సామెతగా... తలంటు పోసుకుని సాయంత్రం ఆరు కొట్టేసరికి రోడ్డు మీద కొచ్చాడు.

కొత్త రుచికోసం జిహ్వ ఆరాటపడు తోంది.

చివరికి రిక్షావాడి ద్వారానైనా వేరే కూపీ లాగాలనేసి నిర్ణయించుకున్నాడు..

సిగ్గు విడిచి (అసలుంటేగా!?) ఒకళ్ళిద్దరు రిక్షావాళ్ళను కదిపి చూశాడు.

మొదటివాడు జవాబే ఇవ్వలేదు. రెండోవాడు నవ్వేసి వెళ్ళిపోయాడు. మూడోవాడు "మేమేనా బాబూ అంత సేక మడుసులం..." అనేసి గునిశాడు.

మరో అరఫర్లాంగు ముందుకు పోయి చివరి ప్రయత్నంగా ఎదురొస్తున్న రిక్షా ముసలాడిని అడుగుదామని నిర్ణయించుకున్నాడు.

చివరికి అడిగేడు.

ముసలాడు రిక్షా దిగి అటూ ఇటూ చూచి బుర్ర గోక్కుని పెదవి విరుస్తూ "సానా కరుసవుద్ది బాబూ...." అన్నాడు.

"ఎంతైనా పర్లేదు. సరుకు మాత్రం క్లాస్ వన్‌గా వుండాలి..." రహస్యంగా అన్నాడు కృష్ణమూర్తి.

"సన్నాసి ముండలు మనకొద్దు బాబూ.... మరైతే తమరికి... సంసారం చేసుకునే మడిసి కావాలా.... సదువుకునే వోళ్ళు కావాలా..." అనుభవం పండిన వాడిలా అడిగేడు ముసలాడు.

అమ్మ ముండా కొడకా నువ్వు దేవాంతకుడిలా వున్నావే... ఇన్నాళ్ళూ నీలాంటివాడు దొరక్క ఛస్తున్నాను అనేసి గొణుక్కున్నాడు కృష్ణమూర్తి.

"ఏటాలోసిత్తన్నారూ!... సదువుకుంటున్న పిల్లయితే రేటెక్కువ బాబూ... పైగా సుకముండదు బజారుదయితే

మీ ఆరోగ్యం పాడవుతాది... సంసారం సేసుకునేదైతే... పదో పరకో సేతిలో పెడితే..... రైక గుడ్డకో సినీమా కర్చుకో వత్తుందిలేని సంబరపడిపోతాది..."

తనకు తెలీని కొత్త సంగతులు రిక్షావాడు చెప్తుంటే గుడ్లు మిటకరించి చెవులు అప్పగించి శ్రద్ధగా వింటున్నాడు కృష్ణమూర్తి.

కృష్ణమూర్తి ముఖంలోకి తేరిపార చూచి "మీ అనుమానం నాకు అర్థమైపోనాది బాబూ హోటల్లో గది తీసుకుంటే పోలీసోళ్ళతో బాధ కర్మగాలి పట్టుబడితే బొక్కలో తోత్తారు. లేకుంటే మరో పాతిక ఆడికి ముట్టసెప్పాల్సి వత్తుంది. ఈ బాధలన్నీ ఎందుకు..... నేరుగా దానింటికే తీసుకెడతాను రండి..."

"అమ్మో... వాళ్ళింటికే...." బెదిరిపోయాడు.

మరేం భయంలేదు బాబూ. దాని మొగుడు నెలకి ఇరవై రోజులు వూళ్ళోనే వుండడు. నేను ఎరగని మడిసి కాదుగా బాబూ ఓ అయిదు రూపాయలిచ్చేసి తమరు రిచ్చా ఎక్కి కూర్చోండి... మరో పది నిముసాల్లో తమరికి సరగం చూపిస్తాను."

అన్నిటికీ తలూపి రిక్షా ఎక్కి కూర్చున్నాడు కృష్ణమూర్తి.

రిక్షా తొక్కుతూ ముసలాడు ఏవేవో చెప్తున్నాడు. అవేమీ కృష్ణమూర్తి చెవికి సోకటంలేదు.

తాను చూడబోయే మనిషి రంభా? మేనకా? — తిలోత్తమా? —

తెల్లని పడక, మల్లెపూల గుబాళింపు సుగంధ పరిమళాల సువాసన, అగరు వత్తుల అలరింపు, ఆమె కొంటె చూపు, తన చిలిపి చేష్టలు, ఎంత త్వరగా ఒడిలో వాలి పోవటమా నే ఆలోచిస్తూన్నాడు కృష్ణమూర్తి.

"ఇంకా ఎంత దూరం?" అడిగేడు సిగరెట్ వెలిగించి.

"దగ్గరకొచ్చేం సార్.... పక్కసందే" రొప్పుతూ చెప్పేడు ముసలాడు.

అది పూరికొంపో, పెంకుటిల్లో, మేడో?... ఛ ఛ!— పూరిల్లా? నా నెన్ను.

రిక్షా మలుపులోని ఓ పెంకుటింటి ముందు ఆగింది.

ఆలోచన్లనుండి తేరుకున్నాడు కృష్ణమూర్తి.

"ఇదే ఇల్లు దిగండి సార్..."

మనిషి మూన్పడిపోయాడు కృష్ణమూర్తి.

ముఖంలో నెత్తురుబొట్టు కరువైంది.

రిక్షా తనింటి ముందు ఆగి వుంది.

"ఏయ్ ముసలాడా.... పోనీయ్.... ఇక్కడ ఆపా వేం?" తడి ఆరిన కంఠంతో గదిమేడు.

రిక్షావాడు ఏదో చెప్పబోయాడు.

"మళ్ళీ వద్దాంలే... సెంటర్‌కి పోనీయ్...తలనొప్పిగా వుంది... మాత్ర ఏదైనా వేసుకుని వెంటనే కాఫీ తాగాలి" తొందర పెట్టేడు కృష్ణమూర్తి.

"ఏంది బాబూ వచ్చేదాకా తొందరే... ఎల్లేదాకా తొందరే..." అంటూ రిక్షాని ముందుకు సాగించాడు ముసలాడు.

కృష్ణమూర్తి మనస్సంతా అల్లకల్లోలంగా వుంది. తల భారంగా వుంది. బాధగాను ఇంకా ఏదోఏదోగా వుంది.

అప్పుడు మందు కొట్టాలన్పిస్తోంది కృష్ణమూర్తికి.

రిక్షా సెంటర్లో ఆగింది.

ముసలాడికి డబ్బులిచ్చి పంపేసి పక్కనేవున్న బార్లోకి జొరబడ్డాడు.

విస్కీ ఆర్డరిచ్చేడు

మొదటి రొండు బాధతో తాగేడు.

తర్వాత రొండు కచ్చతో తాగేడు.

చివరి రెండు కసితో తాగేడు.

బిల్లు చెల్లించి రోడ్డుమీదికొచ్చాడు.

కాళ్ళు తడబడుతున్నయ్.... శరీరం తూలుతోంది. రెప్పలు వాలిపోతున్నయ్.

ఇప్పుడెంతో హాయిగా వున్నట్టు ఫీలవుతున్నాడు.

కృష్ణమూర్తి వాలకం కనిపెట్టిన ఓ రిక్షావాడు దగ్గరగా వచ్చి "రిక్షా కావాలా సార్..." అడిగేడు వెంటబడ్డాడు.

రిక్షావాడికేసి విసుగ్గా...చిరాగ్గా చూశాడు.

తన పరిస్థితికి ముఖ్యకారణం... ఆ రిక్షా ముసలాడే.. తన మూడ్ను నాశనం చేశాడు రాస్కెల్!

అందుకే వెంటబడుతున్న రిక్షా కుర్రాడ్ని కరిసి కొట్టాడు. అది చాలదన్నట్టు చడామడా తిట్టేడు.

మనిషి తాగిన మైకంలో వున్నాడు గదానేసి తలొంచుకు వెళ్ళిపోయాడు రిక్షావాడు.

మెలికలు తిరిగిపోయే కాళ్ళను స్వాధీనపర్చుకుంటూ నడకతోనే ఇల్లు చేరుకున్నాడు కృష్ణమూర్తి.

వీధి వాకిలి తలుపులు బార్లగా తెరచి వున్నయ్. ఇంట్లో ట్యూబ్ లైటు కాంతి రోడ్డుమీదికి పడుతోంది.

పంచలో కృష్ణమూర్తి అడుగు పెట్టగానే రాజేశ్వరి బావురుమంది.

ఇద్దరూ ఇంట్లోకి నడిచారు.

ఎరుపెక్కిన రాజేశ్వరి కళ్ళు... దిగమింగుకో

చూస్తున్న ఆమె వెక్కిళ్ళు చూచేసరికి కృష్ణమూర్తి నిషా సగం దిగిపోయినట్టనిపించింది.

వెంటనే వెళ్ళి వీధివాకిలి మూసేసి తలుపు గడియ పెట్టివచ్చింది రాజేశ్వరి.

భార్య చర్యకి ఆశ్చర్యపోతూ ఏదో అడగాలనుకున్నాడు.

"ఏమండి!... మనం ఈ ఇల్లు వెంటనే ఖాళీ చేయాల్సిందే" అంటూ ఆమె తల కృష్ణమూర్తి భుజంమీద ఆన్చి బావురుమంది రాజేశ్వరి.

"ఇప్పుడేమైందనీ..."

"ఓ గంట క్రితం ఎవరో తెలియని వ్యక్తి ఇంట్లోకొచ్చాడు సరాసరి. అతని వాలకం చూచి భయంవేసింది నాకు. ఎవరి కోసమని అడిగేను. తాగి వున్నాడో ఏమో.... మీది మీది కొస్తూ .... ఏదేదో వాగాడు. కంగారుపడి పక్కవాటా పిన్నిగారింట్లోకి పరుగెత్తాను. పరిస్థితి అర్థం కాలేదు నాకు. ఏడుపొచ్చేసింది. అతను వెళ్ళిపోయాడు— తర్వాత పిన్నిగారు చెప్పింది.... మనం రాకపూర్వం ఈ ఇంట్లో అద్దెకున్న ఆడమనిషి మంచిది కాదని ఆమెకోసం మగాళ్ళు ఎప్పుడూ వస్తూ పోతూ వుండేవాళ్ళట!" ఆవేశంగా చెప్పింది రాజేశ్వరి.

"ఏమండీ.... ఇలాంటి ఇంట్లో మనం వుండద్దండీ.... మరో ఇల్లు రేపే చూడాలి మీరు... తల్చుకుంటేనే భయమేస్తోంది" మళ్ళీ ఉద్వేగంగా రాజేశ్వరే అంది.

అందుకా రిక్షావాడు తన ఇంటి ముందుకు తీసుకొచ్చి రిక్షా దిగమన్నాడు... అనుకున్నాడు కృష్ణమూర్తి.

"మాట్లాడ రేమండీ... మిమ్మల్నే .." భర్తను కుదుపుతూ అంది ఎంతకీ సమాధానం చెప్పక పోవటంతో.

"అలాగే..." అన్నాడు నిర్లిప్తంగా.

రాజేశ్వరి వంటింట్లోకి దారితీసింది.

ఇల్లు మారటమే కాదు... శాశ్వతంగా అస్త్రసన్యాసం చేసి 'వేట' మానేయాలని నిర్ణయానికొచ్చాడు కృష్ణమూర్తి.

[ ఆగస్టు 79 స్వాతి ]

**AN IDEAL PLACE FOR HOMELY FOOD AND COMFORTABLE STAY**

# SRI BALAJI BHAVAN

**Vegetarian Restaurent**
**18-I-70, High Road**

*Phone*: **2755** **CHITTOOR**
*Resi*: **2220** **(A. P.)**

Made out of the Finest Materials

MANGALORE
GANESH
BEEDIES

Smokers Cannot afford to miss them

**Daily Sales Exceed 8 Crore Beedies**

★

*Head Office:*

**Mangalore Ganesh Beedi Works**

**VINOBA ROAD : MYSORE - 570005**

*Telephone:* **20241**

*Telegrams:* **'AROMA.'**